# కాంట్రాక్టు మేరేజి

జాస్మిన్‌కి విద్యార్థినిగా ఉన్నప్పటినుంచీ కొత్తకొత్త ప్రయోగాలను చేయట మంటే చాలా ఇష్టం. ఆమె ఫిలాసఫీలో ఎం.ఏ పూర్తిచేసింది. ఆమె నర్సరీ చదువు తున్నప్పటినుంచీ ఏ సంవత్సరాని కాసంవత్సరం స్నేహితులను మారుస్తూఉండేది. వాళ్ళు తమ స్నేహాన్ని వదులుకోలేక "జాస్మిన్ ! జాస్మిన్" అంటూ వెంట వెంట తిరిగేవారు. ఆమె చూసీ చూడనట్టుగా ఉండగానే కొందరు "దీని మనసు మారి పోయింద''నుకునే వారు. కాని కొందరు ఆమె అట్లా అన్నప్పటికీ వెంట తిరిగే వారు. అప్పుడు ఆమె అనేది "అబ్బ ! ఇంతకాలం చేసిన స్నేహం చాలదూ ? నాకు స్నేహితులయినా ఎప్పటి కప్పుడు కొత్తగా ఉంటేగాని సంతోషంగా ఉండ దని తెలియదూ ?" అని. అప్పుడు వాళ్లు దూరంగా ఉండేవాళ్లు. ఒక్కొక్కళ్ళనే అలా వదలించుకునేది.

ఆలా ఒకప్పుడు వదలించుకున్న స్నేహితురాలే వాణి. ఇరవై సంవత్సరాల తరువాత ఇద్దరూ ఒక నర్సింగ్‌హోములో కలుసుకున్నారు.

అప్పటికి జాస్మిన్ రూపం వేషం చాలా మారిపోయింది. తలంతా నెరిసింది. ఆమె దేహచ్ఛాయలో కూడా మార్పువచ్చి నల్లబడ్డది. మనిషి బాగా లావయింది.

ఆమెనూ ఆమె స్వభావాన్నీ వాణి మరిచిపోలేదు. అందుకే పలకరించాలని పించినా బలవంతంగా ఆపుకుంది.

నర్సింగ్‌హోమ్ చుట్టు స్థలం బాగా ఉన్నది. ముందు ఒకవైపు లాన్, మరొకవైపు పూలచెట్లు వేశారు. మధ్యలో నడవటానికి దారి వదలిపెట్టారు.

ఇద్దరూ ఆ పూలచెట్లను చూస్తూ కుర్చీలలో కూర్చుని డాక్టరు పిలుపుకోసం ఎదురుచూస్తున్నారు. మధ్య మధ్య ఆ సమీపంలో బల్లమీద ఉన్న వారపత్రికలను తిరగవేస్తున్నారు.

గంటకు పైగా ఒకప్పుడు వదలించుకున్న స్నేహితురాలిని పక్కచూపులు చూస్తూ జాస్మిన్ గుర్తుపట్టింది. పలకరించాలనుకుంది గాని మళ్ళీ ఏమనుకుందో మౌనం వహించింది.

అంతలో జాస్మిన్‌కి పిలుపు వచ్చింది. పిలవగానే లోపలికి వెళ్ళి తన సంగతంతా డాక్టరికి చెప్పింది.

"ఇన్నిసార్లు ఇట్లా బలవంతంగా ఎబార్షన్ చెయ్యకూడదు. చదువుకున్న వాళ్ళుకూడా పాతపద్ధతిలో జీవిస్తుంటే చదువురాని వాళ్ళనూ, అమాయకులనూ ఏమనాలి? అయినా ఇన్ని నెలలు వచ్చినతరువాత చేయటం ప్రమాదకరం. అందులో మీకు రక్తపోటుకూడా ఉంది. అదే ఆలోచిస్తున్నాను'' అన్నది డాక్టరు.

''డాక్టర్! మీరు చెప్పినదంతా నాకు తెలుసు. ఇక్కడికి ఈ పనిమీద రావటమంత అవివేకం మరొకటిలేదనీ తెలుసు. జీవనసరళి మార్చుకోకుండా ప్రతిసారీ ఈపని చెయ్యమని అడగకూడదనీ తెలుసు. కాని, ఇది నా జీవితసమస్య. అందుకే మీదగ్గరికి రాక తప్పటంలేదు. ఏం చెయ్యను?'' అన్నది జాస్మిన్ ధైర్యంతో.

''సరే, రేపురండి చూద్దాం. ఏమయినా హెచ్చుతగ్గులు సంభవిస్తే అందుకు నేను బాధ్యురాలిని కాదని తెలుసుకోండి. నాకు ముందుగా హామీపత్రమొకటి మీ యిద్దరి సంతకాలతో ఇవ్వవలసి ఉంటుంది" అన్నది డాక్టరు. జాస్మిన్ అక్కడే కూర్చుంది.

జాస్మిన్ బైటికి రాగానే వాణికి పిలుపువచ్చింది. డాక్టరు చూసి ''అవే మందులు వాడండి. నెలకొకసారి చెకప్ చేయించుకోండి'' అన్నది.

వాణి బైటికి రాగానే ''హలో, నేను జ్ఞాపకం ఉన్నానా?" లేచి వాణి చెయ్యి పట్టుకుంది జాస్మిన్.

వాణి తెల్లబోయి చూసింది.

"వాణీ. నేను జాస్మిన్ను ఇంకా గుర్తుపట్టలేదా నన్ను?''

"అవునా కాదా అని ఆలోచిస్తున్నాను. కాని, నీవు గుర్తుపట్టలేకుండా మారిపోయావు."

''అవును, మొదటి కారణం, చాలాకాలమయింది. రెండవది, నేను చాలా మారిపోయినట్టున్నాను. మూడవది నేను వెనకటి మాదిరిగా పలకరిస్తే పలక్కుండా విదిలించుకుని వెళ్ళిపోతానేమోనన్న జంకు కావచ్చు. ఈ మూడు కారణాలూ నిన్ను పలకరించనివ్వలేదని గ్రహించాను. అంతేనంటావా ?"

''అవన్నీ ఇంకా జ్ఞాపకమున్నాయా ? కాని, చాలా కాలమయింది కనుక కాస్త ఆలోచించాను.''

''అబ్బ, ఏం కప్పిపుచ్చుకుంటావు గాని, ఇంతకాలానికి కలిశావు. అలా లాన్‌లో కూర్చుని మాట్లాడుకుందాం రా'' వాణి చెయ్యిపట్టుకుని లాక్కుపోయి ఒక సిమెంటు బెంచీమీద కూర్చోబెట్టి ఆమెను ఆనుకుని కూర్చుంది జాస్మిన్.

ఆమె ఈ కొత్త ప్రవర్తనకు వాణి ఆశ్చర్యపడుతూ ''జాస్మిన్, నీవు చాలా మారిపోయావు. మనం చదువుకునే రోజుల్లోకూడా నీవు ఎప్పుడూ ఇట్లా మాట్లాడలేదు. నీలో ఈ మార్పు రావటానికి కారణం ? పెళ్ళిచేసుకున్నావా అని అడగటానికి భయంగా ఉంది, చెప్పు ?''

''అయితే నన్నుచూస్తే నీకు ఇంకా భయంగానే ఉందన్నమాట. అవునులే, ఈ జన్మకు మరిచిపోకుండా ఉండేటట్టు మాట్లాడేదాన్ని. నాసంగతిచెప్తాగాని, నీకు పెళ్ళయిందా ? పిల్లలా ?" సామాన్యంగా అందరూ అడిగే ప్రశ్నలే వేసింది జాస్మిన్.

"మేమంతా చదువుకున్న సామాన్యులం జాస్మిన్. అమ్మానాన్నలు తీసుకు వచ్చిన సంబంధం. అరేంజిడ్ మేరేజి, నేనూ ఆయనా ఒకే కంపెనీలో పని చేస్తున్నాం. మాకు ఒక పాప, ఐదవఏడు. స్కూలుకు వెళ్తున్నది.''

''ఐదేళ్ళ పాపా ? ఎలా ఉంటుంది ? నీలాగే తెల్లగా నొక్కుల జుట్టుతో, సొట్టలుపడే బుగ్గలతో నవ్వుతూ ఉంటుందా ? బాగా అల్లరి చేస్తుందా ? పిల్లలు అట్లాఉంటే ఎంత ముద్దొస్తారో ? నీవు చెప్తుంటే నాకోసారి మీ పాపను చూడాలని పిస్తోంది. చూపిస్తావా ?'' ఆమెకు పిల్లలమీద అంత ఆసక్తి ప్రేమా గడచిన పదేళ్ళనుంచీ కలగటం ఆరంభమైంది. ఆ కోరికను మొట్టమొదటిసారిగా వాణి ముందర బయటపెట్టింది.

"అయితే నీవు మాయింటికి వస్తావా ? అమ్మాయినీ మా ఆయన్నూ మా యింటినీ కూడా ఒక్కసారే చూడవచ్చు."

"అవును, నీమాట నిజమేననిపిస్తోంది. కాని, వీలుకాదు వాణీ ఏంచెయ్యను?" విచారంగా పెట్టింది ముఖాన్ని.

"ఏంచెయ్యను అంటావేమిటి ? ఇక్కడికి వచ్చినట్టే మా యింటికి కూడా రా. ఇక్కడికి పదిగజాలదూరం మాయిల్లు. ఇదే వీధిలో చివరి ఇల్లు."

"అబ్బ, ఎంతదగ్గరో ? నా నడకలో రెండునిమిషాలు కూడా ఎక్కువే. అయినా కూడా రావటానికి వీలుకాదు వాణీ. నేను ఇదివరకూ నీవు ఎరిగిన జాస్మిన్ను కాను."

"అయితే ఇంకా గొప్పదాని వయ్యావన్నమాట. అంతేనా ?"

"నా మాటలవల్ల నీకలా అనిపిస్తున్నమాట నిజమే. కాని...."

"అయితే కారణమేమిటో చెప్పు? నీవు ఎప్పుడూ ఇలా మాట్లాడేదానవు కాదే? ఈ మార్పు నీలో ఎలాకలిగింది ? ఎందుకు కలిగింది ? నీవు ఇదివరకటి జాస్మిన్ కాదంటున్నావుగా ? ఇప్పుడు చెప్పు ఇంత లావెప్పుడైనావు ? ఎందుకు కానిచ్చావు ?"

"అబ్బా, నామాటలతో నన్నే పొడుస్తున్నావా వాణీ ? ఇదంతా స్వయం కృతాపరాధమేననుకో."

"అంటే పెళ్ళిచేసుకున్నావా ?"

"చేసుకోకూడదనుకునే ఇంతకాలమూ గడిపాను. ఉద్యోగం చేస్తున్నాను. ఒక ఆఫీసులో పనిచెయ్యటం వల్ల బాస్‌తో స్నేహమయింది. ఒక నిమిషమయినా చూడకుండా ఉండలేని స్థితిలో ఆయన ఒక కండిషన్ పెట్టాడు."

"ఏమని ? పెళ్ళిచేసుకుందామనా ?"

"అలా అయినా బాగుండును. దాన్ని పెళ్ళిఅనాలో ఇంకోపేరేదయినా ఉందో తెలియదు.

నేను ఆయన మాటను అంగీకరించిన తరువాత-ఇందాక ఒక కండిషన్

అనే చెప్పినట్టున్నాను, అది పొరబాటు. ఎన్నో నీవే లెక్కబెట్టు. అది పదిహేనేళ్ల కంట్రాక్టు, పిల్లలు పుట్టకూడదు. నేను ఎక్కడికి వెళ్లగూడదు నాకు ప్రత్యేకంగా పర్సు ఉండకూడదు. బ్రీచ్ ఆఫ్ కంట్రాక్టు కనక జరిగితే ఉద్యోగం పోతుంది. డబ్బేమీఉండదు మరిచిపోయినా చెప్పటం-ఇంకొకటుంది. నాకు ఆడ స్నేహితులు కూడా ఉండకూడదు అందుచేత నేను మీ యింటికి రాలేనువాణీ. అందులో ఒక కండిషన్ ప్రకారం నేను ఇక్కడికి రావలసివచ్చింది. ఇది ఆరవసారి. డాక్టరు వచ్చినప్పుడల్లా చివాట్లుపెడుతుంది. ఆమెకు క్షమాపణలు చెప్పుకుంటూఉంటాను. తను వచ్చి చెప్పచ్చుగా? కాని-చెప్పడు'' ఆమె కళ్ళల్లో నీళ్ళు ఊరుతున్నాయి.

వాణికి ఏమనాలో అర్థంకాలేదు. ఏది మాట్లాడినా ఆమెను ఎత్తిపొడిచిన ట్లవుతుంది. ఆ పని తను చెయ్యలేదు ఆమె తన మనసులో బాల్యస్నేహితురాలే. ఆమె పరిస్థితులకు జాలి-అతి స్వల్పకాలమైనా తీయటి బాల్యస్నేహం. మనసు కరిగిపోయి, కన్నీళ్ళుగామారి చెంపలమీదుగా జాలువారాయి. చప్పున తుడుచుకుని "రేపు మా పాపకు సెలవు. నేను సెలవుమీదఉన్నాను రేపు ఈవేళకు ఇక్కడికి తీసుకురానా పాపను? నీకున్న కోరికలలో నేను తీర్చగలిగింది ఇదొక్కటే చెప్పు?''

''ఆఁ తీసుకురా కాని-రేపు ఈపాటికి పాపను ఎత్తుకునేస్థితిలో ఉండను. బెడ్‌రెస్టు. అయినా తీసుకురా కళ్ళతోచూస్తాను చేతులతో బుగ్గలు నిమురుతాను. కొంతలో కొంత తృప్తి''

''సరే తీసుకువస్తాను అప్పుడు మీ ఆయన ఇక్కడుండడుకదా?''

"ఉండడు అసలు రానేరాడు. నాకు జీవితంలో ఏడాదికో-రెండేళ్ళకో-ఈ నర్సింగ్‌హోముకు వచ్చే స్వాతంత్ర్యం ఒక్కటేవరమనుకో. నిన్నయినా ఇక్కడ కనుక చూడకలిగాను-నా అదృష్టంకొద్దీ వస్తావుగా రేపు? ఇంక నేను వెళ్ళాలి ఇంత సేపు ఇక్కడ ఉన్నదానికి ఆయనకు సంజాయిషీ ఇచ్చుకోవాలి. డాక్టర్ ఆలస్యం చేసిందనిచెబితే ఆమెకు ఫోనుచేస్తాడు....ఒక్కొక్కసారి ఇక్కడికి వచ్చినప్పుడు ఏదో చదువుతూ కూర్చుంటాను. టైమెంతయిందో తెలియకుండా మనసుకు హాయిగా సంతోషంగా గడుస్తుంది. ఆయన నిమిషాలు లెక్కబెట్టే మనిషికదా నేను మామూలుగా డాక్టరు మీదికి నెట్టేస్తాను. అలా ఊరుకోడుగా? వెంటనే డాక్టరికి ఫోనుచేసి "ఇంకనుంచీ ఇంతింత ఆలస్యంచేస్తే ఇంకో డాక్టరు దగ్గరికి

పంపిస్తానని బెదిరిస్తాడు. ఆమె "పంపించండి నాదగ్గర కూర్చోబెట్టుకుంటే నాకేం ఒరుగుతుంది" అని ఫోను పెట్టేస్తుంది. ఇంకచూడు నేను ఇంట్లోఅడుగు పెట్టగానే పశువైపోతాడు.

"ఇంక వినలేను జాస్మిన్. నీ సంగతి ఇంతవిన్న తరువాతకూడా నా ఒక్క ప్రశ్నకు జవాబు దొరకటంలేదు. నీవు ఎవరితోను చనువుగా ఉండని మనిషివి-ఎవరినీ లెక్క-చెయ్యనిదానివి-ఎవరికీ లొంగనిదానివి-ఈయనకు ఎట్లాలొంగిపోయి, ఈయనపెట్టిన కండిషన్ల కన్నిటినీ అంగీకరించి భయపడుతూ-నీవన్నమాటే-ఈ పశువుతో ఎట్లాజీవిస్తున్నావా? అన్ని. దీనికి నీవు జవాబు చెప్పనక్కర్లేదు. నేనే రేపు పాపతోవస్తాను" అని అప్పటికే లేవటానికి సిద్ధమైన జాస్మిన్ బుజమ్మీద చెయ్యేసి ముందుకు అడుగువేసింది.

"వాణీ! నీవు జవాబుకోరకపోయినా నేను చెప్తున్నాను. కళ్ళు రెండూ మూసుకుపోయ్యాయి"

వెనక్కు చూసుకుంటూ ముందుకు నడిచారు.

ఆ రాత్రి వాణి మనసు చాలా కలవరపడింది. తామిద్దరు కోఎడ్యుకేషన్ కాలేజిలోకూడా కలిసే చదివారు. ఆ వయసులోకూడా మగపిల్లలను ఫుట్‌బాల్‌ని తన్నినట్టు తన్నగా తన కళ్ళతోచూసింది.

"బొత్తిగా భయంలేదు. దున్నపోతులు" అని తిడుతూ చేతులు దులుపు కుంటూ క్లాసులోనికివచ్చేది. వాళ్ళల్లో ఒక్కరైనా ప్రిన్సిపల్‌కి కంప్లైంటుచేసే వారుకాదు. స్కూల్లో-కాలేజీలో-ఎక్కడయినా జాస్మినంటే అందరికీ భయమే.

చాలా సేపు నిద్రపట్టలేదు. నిద్రలేకపోతే ఆరోగ్యందెబ్బతింటుందన్నభయం తనకు తెల్లవారేముందర కళ్ళుమూతలుపడ్డాయి.

వాణి పాపను చదివిస్తూ కూర్చుంది మధ్యాహ్నం. కొంత సేపటికి పాప నవ్వుతూ హేళనగా చప్పట్లుకొట్టింది.

వాణి తెల్లబోయి చూసింది.

"ఈ లెక్క తప్పుచేశాను. ఈ డిక్టేషన్‌లోకూడా రెండు స్పెల్లింగు తప్పు

లున్నాయి. నీవు సరిగ్గాచూడకుండా టిక్ పెట్టావు మళ్ళీ నేనే చూసుకుని దిద్దుకున్నాను .మా టీచరు చూసిందంటే నవ్వుతుంది నిన్నుచూసి.

''ఎక్కడో ఆలోచిస్తున్నాను పాపా.''

''ఇట్లా చదువుచెబితే నేనేం పాసవుతాను?''

''అక్కడ నాకొక పాత స్నేహితురాలు కలిసింది."

''ఎక్కడ?''

''నర్సింగ్‌హోములో, ఆమెకు పాపలులేరట. పాపలంటే చాలా ఇష్టంట పాపం ఏడ్చింది. అందుకని నాకు బాధనిపించింది.''

''అయ్యో, పాపలు లేకపోతే ఏడుస్తారా? నీవెప్పుడైనా ఏడ్చావా? ఓ.... మరిచిపోయాను. నేనున్నాగా?''

''అవునవును నీవున్నావుగా? నేనెందుకేడుస్తాను?''

"అప్పుడప్పుడు నన్ను కోప్పడతావుగా?"

''మరి అల్లరిచేస్తే అమ్మలు ఊరుకుంటారా? నా స్నేహితురాలు ఏడ్చిరిది కదా. అందుకని ఆమెకు నిన్ను ఒకసారి చూపిస్తానని చెప్పాను.''

"చూసి నన్ను తీసేసుకోదు కదా ? ఆమె అడిగితే ఇచ్చేస్తావా ?"

''ఛ, నేనెందుకిస్తాను ? ఆమె చూస్తానంటే చూపిస్తానన్నాను. అంతే ?''

''అయితే వస్తాలే" ఎంతో పెద్దదానిలా మాట్లాడింది పాప.

మరునాడు పాపను తీసుకుని వాణి వెళ్ళేసరికి మధ్యాహ్నం రెండుగంటలయింది. జాస్మిన్‌కి ఆపరేషన్ జరిగిందట ఆ ఉదయమే.

''జాస్మిన్ ఎట్లా ఉంది ?" డాక్టర్ని అడిగింది.

"ఈ సారి సిజేరియన్ చేయవలసి వచ్చింది. నిద్రపోవటానికి ఇంజక్షను ఇచ్చాను. ఐదునిమిషాల్కిందటే కాఫీ తాగింది, ఇంకా నిద్రరాలేదు. మేలుకునే ఉంది. వెళ్ళి చూడండి'' అంది.

వాణి పాపతో వెళ్ళి కుర్చీమీద కూర్చుంది. జాస్మిన్ ఇంటి కప్పువైపు చూస్తున్నది. అలికిడికి పక్కకు తిరిగి చూడగానే వాణి పాప కనబడ్డారు.

''హలో! వాణి! నిజంగా పాపను తీసుకువచ్చావు. నామీద నీకింత అభిమానముందని నేననుకోలేదు. ఈ స్వీటీ మీపాపేనా ? బేబి, ఇక్కడికి నామంచం దగ్గరికి రా. నీకోసం ఈ చాకొలెట్లు, ఈ బొమ్మలు కొన్నాను వచ్చేటప్పుడు. తీసుకో." పక్కనే బల్లమీద ఉన్న సంచీలోనుంచి తీసియిచ్చింది.

మొదట కొంచెం సందేహించినా తరువాత తీసుకుంది పాప. "థ్యాంక్యూ అంటీ" అంటూ.

''ఏవీ నీబుగ్గలు చూడనీ'' అంటూ చేత్తోనొక్కి తన పెదవుల కానించుకుంది. జాస్మిన్ కళ్ళనిండా నీళ్ళు.

పాపను లాన్‌లో పిల్లలతో ఆడుకొమ్మని చెప్పి వాణి వచ్చి కుర్చీలో కూర్చుంటూ- ''చాలా బాధగా ఉందా జాస్మిన్ ! ముఖమంతా వాడిపోయింది ?'' అడిగింది.

"ఎప్పుడూ ఎబార్షన్ చేయించుకొమ్మని నా వెంటపడుతున్నాడని ప్రాణం విసిగిపోయి, తెగించి, మూడునెలలు దాదాపు తగ్గించి చెప్పాను. అలవాటుగా మూడునెలలు నిండగానే ఇక్కడికి పంపించాడు. దాదాపు ఆరునెలలు కడుపులో పెరిగిన పాపను నశింపచెయ్యాలి.''

చూడగానే డాక్టరన్నది- ''ఈ పిండాన్ని నేను తియ్యలేను. నాకు వేరే సహాయం చేసేవాళ్ళుకూడా లేరు. మీరు మంచిథియేటరూ డాక్టరూ ఉన్నచోట చేర్చండి. కావాలంటే తరువాత నా దగ్గరుంచుకుంటాను. కడుపులో బాగా పెరిగింది పాప. ఇది నా వల్లకాదు'' డాక్టరు ఆయనకు ఫోనుచేసింది. వెంటనే కారులో వచ్చి ఇంకొక పెద్ద నర్సింగ్‌హోములో చేర్పించాడు. వాళ్ళు అక్కడ సిజేరియన్ ఆపరేషన్ చేసి బిడ్డను తీశారు. రెండుగంటలకుపైగా అక్కడ ఉంచుకుని వాళ్ళు ఇక్కడికి ఆయన చెప్పినట్టుగా పంపించారు. నేను థియేటరు నర్సును పాపను చూపించమన్నాను. డాక్టర్లు వెళ్ళిన తరువాత చూపించింది. తెల్లగా బాగా ఆరోగ్యంగా ఎదిగిన పాప కళ్ళుమూసుకుని ప్రేలోపడి ఉంది. కడుపులో నుంచి దుఃఖం పెల్లుబికివస్తోంది.

"కుట్లు వేశారు. ఏడవకు. ఏడిస్తే ఆ కుట్లు కదులుతాయి. నీ కింకాకష్టం" అంటూ అంబులెన్సులో ఇక్కడ దించి వెళ్ళిపోయింది. ఈ డాక్టరు నిద్రకు మందిచ్చింది. మగతగా ఉంది కాని నిద్రరావటం లేదు. ఆ బిడ్డను చూసిన తరువాత గుండె పిండేస్తున్నదాదృశ్యం" అంటూ కళ్ళుమూసుకుంది జాస్మిన్.

ఐదునిమిషాలు చూసి చెయ్యిపట్టుకుని లేపబోయింది వాణి తనువెళ్తున్నట్టుగా చెప్పటానికి.

ఆ చేతుల్లోని జాకెటు, జబ్బలమీద మోచేతివరకూ గుండ్రని కాలినమచ్చలు ముగ్గుపెట్టినట్టుగా ఉన్నాయి. వాటిని చూసి చప్పున దుప్పటి కప్పి బయటికి వచ్చి బేబీని తీసుకుని ఇంటికి వెళ్ళిపోయింది వాణి.

ఆ రాత్రీ మరునాడూ కూడా జాస్మిన్, ఆమె చేతిమీది మచ్చలు కళ్ళ ముందర ఉన్నట్టే అనిపించింది. ''ఒక్కసారి నన్ను వచ్చి చూడవా'' అని జాస్మిన్ కళ్ళు మూసుకోగానే అడుగుతున్నట్లని పించింది.

మూడవనాడు పాపకూ తండ్రికీ కూడా సెలవు. పాపను తండ్రికి అప్పగించి బయలుదేరింది.

ఆనాటికి జాస్మిన్ కొంచెం కోలుకున్నట్టు కనబడింది. ఉదయం పాలు బ్రెడ్ తీసుకుందట. ఒంటిగంటకు కొద్దిగా భోజనం చేసిందట. వాణి వెళ్ళేసరికి మేలుకునే ఉంది, చూసి 'కూర్చో' అని కుర్చీచూపించింది.

''వాణీ, మొన్న వచ్చినట్టున్నావు కదూ ? నాకు ఒకటే మత్తు. నీతో ఏదో చెప్పినట్టున్నాను. పాపకోసం ముచ్చటపడి డాక్టర్ని డబ్బడిగి ఏవో తెచ్చాను. ఇచ్చినట్టే గుర్తు. ఇవేళ కొంచెం నయంగా ఉంది, మత్తు లేదు.

వాణీ నీకు నామీద ఎంత అభిమానం లేకపోతే ఇన్నిసార్లు వస్తావు ? తలుచుకుంటే నాకు కన్నీళ్లొస్తాయి. బేబీ రాలేదా ?'' అంటూ ఇటూ అటూ చూసింది.

''ఇవాళ రాలేదు, తండ్రి ఇంట్లో ఉంటే ఎక్కడికీ రాదు.''

''నీవూ నీపాప ! ఎంత అదృష్టవంతులో ?" కంటికొనల నుండి కన్నీరు కారుతున్నది జాస్మిన్‌కి.

''జాస్మిన్, నీవు ఇప్పుడు ఏడవకూడదు. నీవు బాలెంతతో సమానం. జరిగినదంతా మర్చిపో, ఒక కలనుకో.''

''ఇప్పుడుకాక ఇంకెప్పుడు ఏడవను? జీవితంలో ఎన్నిసార్లు ఈ ఘట్టాలను కలలనుకోను ?"

"ఛ, ఆమాటలు మాట్లాడకు, నీవు ఇంటికి ఎప్పుడు వెళ్లుతున్నావు?"

''ఏమో ?"

''మొన్న నేను వచ్చినప్పుడు, వెళ్తున్నానని నీతో చెప్పటానికి చేతిమీద తట్టి లేపుదామని చేతిని కదిపాను. దుప్పటి పక్కకుపోయింది. నీ చేతిమీదంతా నల్లటి గుండ్రటి మచ్చలు. ఏమిటవి ? పుండ్లు లేచాయా ? ఇప్పుడు మానినట్లు న్నాయి. ఏమయింది ?''

జాస్మిన్ ముఖం చాలా చిక్కిపోయింది. ఎండిపోయిన ముఖంలో కళ్ళు మిణుకు మిణుకు మంటూన్నాయి. కళ్ళనీళ్ళు తెచ్చుకుని పేలవంగా నవ్వింది.

"నీవూచూశావా వాటిని? మొన్న హాస్పిటల్లోకూడా అడిగారు నర్సులు. అవి మా యిద్దరిమధ్య సంఘర్షణలకు సంకేతాలు. ఎప్పుడూఒకసిగరెట్ నోట్లోఉంటుంది. చైన్‌స్మోకర్‌కదా? మాట్లాడేటప్పుడు తన కిష్టంలేనిమాట నేను మాట్లాడితే వెంటనే దానికి గుర్తుగా మండేసిగరెట్టును అంటించటం అతడికి అలవాటు. అవన్నీచూసి నీవు లెక్కపెట్టావా ఏమిటి?''

"లెక్కబెట్టలేదుగాని, చూడగానే భయంవేసింది. మొదట ఆదేమయినా జబ్బేమో ననుకున్నాను చటుక్కున దుప్పటి కప్పేసి వెళ్ళిపోయాను."

"నీవు మొదటినుంచి స్వాతంత్ర్య ప్రియురాలివి. ఇంటికి ఎప్పుడు వెళ్తావని అడిగితే ఇప్పుడు ఏమోనంటున్నావు. మా నాన్న ఎప్పుడూ అనేమాట ఏమిటంటే ''మీ అమ్మ ఎప్పుడు పుట్టింటికి వెళ్తుందో ఎప్పుడువస్తుందో నాకు చెప్పటం నేను వెళ్లమనటం జరగలేదు. "వెళ్తున్నాను" అని వెళ్లిపోయేది. "వచ్చాను"అంటే చూసి నవ్వేవాడిని. ఇంట్లోకూడా.మంచి పనులే-అవసరమైనవే-అయినా నన్నడిగేదికాదు. చేస్తే చూసేవాడిని. ఆమె సర్వస్వతంత్రురాలు అయినా వేలెత్తిచూపించేవని ఒక్క

టయినా చేసేదికాదు"అని చెప్పేవారు. నీవేమో ''ఎప్పుడు ఇంటికివెళ్తావనిఅడిగితే సరిగా జవాబు చెప్పటంలేదు"

జాస్మిన్ పేలవంగా నవ్వింది మళ్లీ.

''ఇంక ఇంటికి వెళ్తాను జాస్మిన్. మళ్లీ కలుస్తామోలేదో?'' వెళ్లిపోయింది వాణి.

తరువాత రెండు రోజులకు జాస్మిన్ను చూడాలని వాణి వెళ్లింది. ఊహించి నట్లే ''ఆ క్రిందటిరోజే వెళ్ళిపోయిందని డాక్టరు చెప్పింది.

ఆ సాయంత్రం టీ. వీ. వార్తలలో మూసీనదిలో ఒక శవం కొట్టుకువచ్చి చాదర్‌ఘాట్ బ్రిడ్జిక్రింద ఒకరాయి అడ్డంవచ్చి నిలిచిపోయిందనీ జనం మూగి చూస్తున్నారనీ పోలీసులు వాళ్లను అటకాయిస్తున్నారనీ, తాజావార్త వినవచ్చింది.

జాస్మిన్ భర్త నర్సింగ్‌హోముకువెళ్ళి డాక్టర్ని అడిగాడట. ఆమె వెళ్లి పోయిందనగానే మూసీనది దగ్గరికివెళ్ళి చూశాడట. నాని ఉబ్బిపోయిన శవాన్ని గుర్తుపట్టటంకష్టమే అయింది. చప్పున చేతులుచూశాడట. తనుపెట్టిన గుర్తులు రెండు చేతులమీద నల్లగా కనబడ్డాయట. అందరూచూసి వచ్చినట్టు తనూచూసి వచ్చాడట.

అక్కడినుంచివచ్చినవెంటనే ఆమె ఫోటోతోపాటు ఆమె కనబడటంలేదని పోలీసు రిపోర్టుఇచ్చాడట. పోలీసులు "ఒకశవందొరికింది" "ఇదేమో'' చూడమంటే చూసి "ఇదికాదు'' అన్నాడట.

''మా యిద్దరిమధ్యా కాంట్రాక్టు ఇంకాఉండగా ఆమె ఎట్లా చచ్చిపోతుంది? చావటానికి వీల్లేదు. ఆమె పారిపోవటానికి డాక్టరు సహాయంచేసిఉండాలి'' అని నా మీద కేసుపెట్టి రోజూ పోలీసుస్టేషన్‌చుట్టూ లాయరుచుట్టూ తిరుగుతున్నా డట".

వాణి పురిటికివెళ్ళినప్పుడు డాక్టరు చెప్పిందట.

''ఆమెచేత నేను హామీపత్రం రాయించుకున్నాను వెళ్ళేటప్పుడు, ఆయన డబ్బంతా ఖర్చుచేసినా ఆమె దొరకదు, ఇంక నేను మళ్ళీ నర్సింగ్‌హోమ్‌కిరాను.

వెళ్ళిపోతున్నాను.'' అని ఆమె స్వదస్తూరితో రాసియిచ్చిన పత్రాన్ని జెరాక్సు చేయించి పెట్టుకున్నాను" అంది డాక్టరు.

''బహుశః చనిపోయిందామే కావచ్చు'నన్నది డాక్టరు వాణితో.

''ఏమో? ఆయన అన్నట్టుగా ఎట్లాచనిపోతుంది కాంట్రాక్టుఇంకాఉండగా?'' అని వాణి కూడా అనుకుంది.